# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 28-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రానున్న ఖరీఫ్ సీజన్ దృష్ట్యా కేంద్ర మంత్రివర్గం 14 రకాల పంటల కనీస మద్దతు ధరలను పెంచుతూ ఈరోజు నిర్ణయం తీసుకుంది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాలుగు రాష్ట్రాల పర్యటనలో భాగంగా రేపటి నుండి 70 వేల కోట్ల రూపాయల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు.
- ❖ పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ నిర్వహిస్తున్న ప్రపంచవ్యాప్త ప్రచారంలో భాగంగా అఖిలపక్ష ప్రతినిధి బృందాలు ఈరోజు పలు దేశాల్లో పర్యటిస్తున్నాయి.
- ❖ మహారాష్ట్రలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు 8 మంది ప్రాణాలు కోల్పోయారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న ఖరీఫ్ సీజన్ దృష్ట్యా కేంద్ర మంత్రివర్గం 14 రకాల పంటల కనీస మద్దతు ధరలను పెంచేందుకు ఈరోజు ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు న్యూఢిల్లీలో సమావేశమైన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కమిటీ రైతుల పంట ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలు లభించేలా ఈ నిర్ణయం తీసుకుంది. గత కొంత కాలంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పంటల కనీస మద్దతు ధరను పెంచుతూ వస్తోందని.. అలాగే 2025-26 మార్కెటింగ్ సీజన్ దృష్ట్యా రైతులు లాభాలు ఆర్జించేలా పంటల మద్దతు ధరలను పెంచామని కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ...

(వాయిస్ 28 సెకన్లు)

కేంద్ర ఆర్థిక వ్యవహారాల కమిటీ ఆమోదించిన ప్రకారం ధాన్యం క్వింటాల్ మద్దతు ధర 69 రూపాయల మేర పెరిగింది. అలాగే నూనె గింజల పంటలైన వేరుశెనగ క్వింటాల్ కు 480 రూపాయలు, పొద్దుతిరుగుడు 441 రూపాయలు, సోయాబీన్ 436 రూపాయలు, పత్తి కనీస మద్దతు 589 రూపాయల మేర పెరిగింది.

అదే విధంగా ఈ మంత్రివర్గ సమావేశంలో భారతీయ రైల్వేలకు సంబంధించి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల మధ్య రెండు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులను కూడా క్యాబినెట్ ఆమోదించింది. 3 వేల 399 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుల వలన లాజిస్టిక్ ఖర్చు, చమురు దిగుమతులు తగ్గుతాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ లోని వైఎస్సార్ కడప జిల్లాలోని బద్వేల్ నుంచి నెల్లూరు మధ్య నాలుగు వరుసల నూతన రహదారి నిర్మాణానికి సైతం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాలుగు రాష్ట్రాల పర్యటనలో భాగంగా రేపు సిక్కిం వెళ్లనున్నారు. రెండు రోజుల పాటూ జరిగే ఈ పర్యటనలో సిక్కింతో పాటూ పశ్చిమ బెంగాల్, బీహార్ ఉత్తరప్రదేశ్‌లలోని 70 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. ముందుగా రేపు సిక్కిం చేరుకొని.. సిక్కిం స్వర్ణోత్సవం పేరిట జరగనున్న బహిరంగ సభను ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగించనున్నారు. నామ్చి జిల్లాలో 750 కోట్ల రూపాయలకు పైగా విలువైన 500 పడకల నూతన జిల్లా ఆసుపత్రిని ప్రారంభించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో అఖిలపక్ష పార్లమెంటరీ ప్రతినిధి బృందాలు విదేశాలలో పర్యటిస్తున్నాయి. అందులో భాగంగా జెడి (యు) ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఈరోజు ఇండోనేషియాలోని జకార్తాకు చేరుకుంది. పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం నిర్వహిస్తున్న ప్రపంచవ్యాప్త ప్రచారంలో భాగంగా ఈ ప్రతినిధి బృందం ఇప్పటివరకు జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్‌లను సందర్శించింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ నిబద్ధతపై వారికి అవగాహన కల్పించడానికి ఈ బృందం ఇంటర్-పార్లమెంటరీ సహకార కమిటీ వైస్-చైర్‌పర్సన్ ముహమ్మద్ హుసేన్ తో సమావేశమైంది. మరోవైపు బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలోని అఖిలపక్ష ప్రతినిధి బృందం విస్తృత స్థాయి చర్చల కోసం ఈరోజు రోమ్ నగరానికి చేరుకుంది. సీమాంతర ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశపు ఐక్య సందేశాన్ని ప్రతినిధి బృందం ఈ సందర్భంగా తెలియజేసింది. ఇక శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే నేతృత్వంలోని మరో ప్రతినిధి బృందం డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో పర్యటనను ముగించుకొని సియెర్రా లియోన్‌కు బయలుదేరింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్రలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు వ్యక్తులు గాయపడి ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. అనేక జిల్లాల్లో ఈ వర్షాల భీభత్సంతో భారీ ఆస్తినష్టం సంభవించింది. పూణేలో ముగ్గురు, జల్నాలో ఇద్దరు, ముంబై, రాయ్‌గడ్, అహల్యా నగర్‌లలో ఒక్కొక్కరు చొప్పున మరణించారని అధికారులు వెల్లడించారు. అనేక చోట్ల ఇల్లు ధ్వంసమవడం, చెట్లు కూలిపోవడం, పంట నీట మునగడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మృతుల కుటుంబాలకు తక్షణ నష్ట పరిహారం అందించాలని, విపత్తు సహాయ నిబంధనల ప్రకారం పంట నష్టానికి కూడా పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించారు.

ఇదిలా ఉండగా ఈరోజు మహారాష్ట్రలోని కొన్ని ప్రభావిత జిల్లాలలో వర్షాలు తగ్గుముఖం పడుతున్నాయి. అయితే రత్నగిరి, సింధుదుర్గ్, కొల్హాపూర్, సాంగ్లి జిల్లాలకు మాత్రం రెడ్ అలర్ట్ కొనసాగుతోంది. మరో ఎనిమిది జిల్లాలకు IMD ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆపరేషన్ సిందూర్ విజయానికి కృషి చేసిన భారత సైనికుల పరాక్రమానికి దేశం గౌరవ వందనాలను తెలియజేస్తోంది. సాయుధ దళాలకు సంఘీభావంగా ఆకాశవాణి వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది.

ఇందులో భాగంగా పరమ వీర చక్ర పురస్కార గ్రహీత మేజర్ రామస్వామి పరమేశ్వరన్ గురించి ఈ రోజు తెలుసుకుందాం.

(వాయిస్ 38 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఈరోజు అమెరికా అండర్ సెక్రటరీ జెఫ్రీ కెస్లర్‌తో సమావేశమయ్యారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంలో సహకారాన్ని పెంపొందించుకోవడంతో పాటూ భారత్ అమెరికా వ్యూహాత్మక వాణిజ్య సహకారాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్లడంపై ఇరువురూ ఈ సందర్భంగా చర్చించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఆయనకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో నివాళి అర్పించారు. సావర్కర్ ను బ్రిటిష్ ప్రభుత్వం ఎంత కఠినంగా హింసించినా కూడా మాతృభూమి పట్ల ఆయన భక్తిని తగ్గించలేకపోయిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. సావర్కర్ ధైర్యసాహసాలను, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన పోరాటాన్ని దేశం ఎప్పటికీ మరచిపోదన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పాకిస్తాన్ సరిహద్దు వెంబడి జిల్లాల్లో రేపు సన్నాహక మాక్ డ్రిల్ ను నిర్వహించనున్నారు. గుజరాత్, రాజస్థాన్, పంజాబ్ జమ్మూ కాశ్మీర్‌లలోని పలు జిల్లాలలో ఈ మాక్ డ్రిల్ జరుగనుంది. అత్యవసర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలనే విషయాలను తెలియజేయడంతో పాటూ.. ప్రజలను సన్నద్ధం చేయడానికి అధికారులు రేపు శిక్షణా ప్రదర్శనలు చేయనున్నారు. ఈ మాక్ డ్రిల్ లో ప్రభుత్వ విభాగాలు, NCC క్యాడెట్‌లు, NSS వాలంటీర్లు పాల్గొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 81 వేల 551 పాయింట్ల వద్ద ప్రారంభమై... చివరికి 239 పాయింట్ల నష్టంతో 81 వేల 312 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 73 పాయింట్ల నష్టంతో 24 వేల 752 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం 85.37గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 64.61 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 3 వేల 317 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అస్సాం, మేఘాలయ, కేరళ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, తమిళనాడు, తీరప్రాంత దక్షిణ అంతర్గత కర్ణాటకలో రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =